సాక్షి
జోగులాంబ గద్వాల

బుధవారం ◦ 15 ◦ నవంబర్ ◦ 2023



దుందువా వేడుకలు
జడ్చర్ల మండలం గంగాపురంలో దుందువా వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు.

వివరాలు 10లో ▸



ఆస్పత్రుల్లో సాధారణ కాన్పులు
మల్దకల్ పీహెచ్‌సీలో సాధారణ ప్రసవాలపై వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు.

వివరాలు 11లో ▸

గరిష్టం/కనిష్టం
32.4 /22.8

వాతావరణం
ఉదయం, సాయంత్రం చలితీవ్రత ఎక్కువగా ఉంటుంది. రాత్రికి దట్టమైన మేఘాలు కమ్ము కుంటాయి. వర్షం పడే అవకాశం లేదు.

న్యూస్‌రీల్

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తులు
గద్వాల అర్బన్: ఓపెన్ స్కూల్‌లో 2023–24 సంవత్సరానికి ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ సిరాజుద్దీన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అపరాద రుసుముతో ఈ నెల 30వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.


చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి
గద్వాల క్రైం: చెడు వ్యసనాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి కవిత అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత స్థాయిలో నిలవాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు ఇప్పటి నుంచే క్రీడలు, సమాజంలో జరుగుతున్న అంశాలను వివరించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ధరూరులో కేంద్ర బలగాల కవాతు
ధరూరు: ఎస్పీ రితిరాజ్ ఆదేశాల మేరకు జిల్లాకు వచ్చిన కేంద్ర బలగాలు సమస్యాత్మక గ్రామాల్లో కవాతు నిర్వహిస్తోంది. అందులో భాగంగానే రెండో విడత మండల సబ్ ఇన్స్పెక్టర్ శివానందం గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి ధరూరుతో పాటు ఉప్పేరులో వీధుల వెంట కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శివానందం గౌడ్ మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఇన్సిడెంట్ ఫ్రీగా ఎన్నికలు జరిగేందుకు పోలీసు శాఖ కృషి చేస్తోందన్నారు. జిల్లా పోలీస్ ఫోర్స్‌కు అదనంగా 100 మందితో కూడిన సీఆర్‌పీఎఫ్ వచ్చిందన్నారు. ఎన్నికల సమయంలో పాటించాల్సిన నియమాలు తెలియజేశారు. ఈ నెల 30న జరగబోయే ఎన్నికలకు ఎలాంటి విఘాతం కలుగకుండా శాంతియుతంగా జరిగేలా ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు.

వేరుశనగ క్వింటా రూ.7,940
గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్‌యార్డుకు మంగళవారం 1,711 క్వింటాళ్ల వేరుశనగ రాగా, గరిష్టంగా రూ.7,940, కనిష్టంగా రూ.3,303, సరాసరి రూ.6,390 ధరలు పలికాయి. 148 క్వింటాళ్ల ఆముదం రాగా, గరిష్టంగా రూ.5,390, కనిష్టంగా రూ.3,909, సరాసరి రూ.5,299 ధరలు వచ్చాయి. 1059 క్వింటాళ్ల వరి(సోన) రాగా.. గరిష్టంగా రూ.2,410, కనిష్టంగా రూ.2,001, సరాసరి ధర రూ.2,319 ధరలు పలికాయి. 49 క్వింటాళ్ల వరి (హంస) రాగా, గరిష్టంగా.2,160, కనిష్టంగా రూ.2,060, సరాసరి రూ.2,160 ధరలు వచ్చాయి.

స్వతంత్ర వీరులు..

- పార్టీల మద్దతు లేకుండా ఎమ్మెల్యేలుగా గెలుపు
- పరిస్థితులు అనుకూలించక కొందరు.. పార్టీ అండ వద్దని మరికొందరు
- కొన్నిచోట్ల బోణీ చేయలేకపోయిన ఇండిపెండెంట్లు



ఎన్నికలంటే పెద్ద తతంగం.. ఐదేళ్లకోసారి వచ్చే ఎన్నికల్లో పోటీకి దిగాలనుకునేవారు రెండు, మూడేళ్ల ముందు నుంచే కసరత్తు ప్రారంభిస్తారు. నియోజకవర్గ వ్యాప్తంగా పర్యటించడం.. కార్యకర్తలు, ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకోవడం.. మంచీచెడు చూసుకోవడం వంటివి చేస్తూ కేడర్‌పై పట్టు సాధించడమంటే మామూలు విషయం కాదు. ఇదంతా పూర్తయ్యాక ఎన్నికల వేళ పార్టీ టికెట్ వస్తుందో లేదో తెలియదు. అప్పటికప్పుడు కొత్త నేతలు వస్తే సమీకరణల నేపథ్యంలో వారికే టికెట్ దక్కవచ్చు. అదే జరిగితే రెండు, మూడేళ్ల కష్టం వృథా అయినట్లే. అధిష్టానాల నుంచి భవిష్యత్‌పై స్పష్టమైన హామీ వస్తేనే గెలుపు ఖాయమనే భావనతో కొందరు పోటీకి సై అంటుంటారు. మరికొందరు ఏదో పార్టీ నుంచి పోటీకి దిగడం ఇష్టం లేక స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో దిగుతుంటారు.

– నాగర్‌కర్నూల్

స్వతంత్రులు.. ఆ నలుగురు
మహబూబ్‌నగర్, వికారాబాద్ జిల్లాలో కలిసి ఉన్న కొడంగల్ నియోజకవర్గానికి ఇండిపెండెంట్ల పరంగా ఓ రికార్డు ఉంది. ఈ సెగ్మెంట్‌లో నలుగురు స్వతంత్ర అభ్యర్థులు గెలిచారు. 1962 ఎన్నికల్లో రుక్మారెడ్డి, 1967లో అచ్యుతారెడ్డి, 1972లో నందారం వెంకటయ్య, 1978లో గుర్నాథ్‌రెడ్డి స్వతంత్రులుగా బరిలోకి దిగి విజయం సాధించారు. ఇందులో గుర్నాథ్‌రెడ్డి 1983, 1989, 2004 ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున గెలవగా.. నందారం వెంకటయ్య 1985లో టీడీపీ అభ్యర్థిగా గెలుపొందారు. కాగా.. ఉమ్మడి జిల్లాలోని దేవరకద్ర, అచ్చంపేట, వనపర్తి, నారాయణపేట నియోజకవర్గాల నుంచి స్వతంత్రలెవరికీ ఇంత వరకు విజయం దక్కలేదు.

నమ్మకంతో బరిలోకి..
ఎన్నికల వేళ అన్ని పార్టీల్లోనూ మార్పులు, చేర్పులు జరగడం సహజం. ఈ సందర్భంగా పార్టీ టికెట్ ఆశించినా దక్కకపోవచ్చు. టికెట్‌పై ఆశలేని వారికి అవకాశం దక్కవచ్చు. ఈ నేపథ్యంలో తప్పక గెలుస్తామనే నమ్మకం ఉన్నవారు, పార్టీ ప్రకటించిన అభ్యర్థి కంటే తమకే బలం ఎక్కువని నమ్మే వారే కాకుండా.. పార్టీ టికెట్‌పై పోటీ చేయడం ఇష్టం లేని వారు ఎన్నికల బరిలో ఇండిపెండెంట్లుగా దిగుతున్నారు. ఇలా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పలువురు స్వతంత్రులుగా రంగంలోకి దిగి చరిత్ర సృష్టించారు. మరికొందరికి పరాజయమే ఎదురైంది.


నాగం జనార్దన్‌రెడ్డి, నాగర్‌కర్నూల్


గుర్నాథ్‌రెడ్డి, కొడంగల్


డీకే భరతసింహారెడ్డి, గద్వాల


జూపల్లి కృష్ణారావు, కొల్లాపూర్

రెండుసార్లు ఒక్కరే..
2009లో కనుమరుగైన అమరచింత నియోజకవర్గానికి స్వతంత్ర అభ్యర్థులకు సంబంధించి ఓ రికార్డు ఉంది. ఈ సెగ్మెంట్‌కు 1952 నుంచి 2004 వరకు మొత్తం 11 సార్లు ఎన్నికలు జరిగాయి. 1962, 1967 ఎన్నికల్లో అమరచింత సంస్థానానికి చెందిన రాజవంశీయుడు రాజా సోంభూపాల్ ఇండిపెండెంట్‌గా పోటీ చేసి విజయం సాధించారు. అయితే రాజవంశీయుడు కావడంతో సహజంగానే అన్ని పార్టీల వారు తమ తరఫున పోటీకి దిగాలని కోరారు. కానీ ఏ పార్టీని ఎంచుకున్నా మరో పార్టీని తిరస్కరించినట్లు అవుతుందని, అది మంచి పద్ధతి కాదనే భావనతో రాజ సోంభూపాల్ ఇండిపెండెంట్‌గా బరిలోకి దిగి విజయం సాధించారు. ఇక మూడోసారి 1972 ఎన్నికల్లో ఆయన కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీచేసి ఎన్నికయ్యారు. అదే నియోజకవర్గం నుంచి 1957లో జరిగిన ఎన్నికల్లో డి.మురళీధర్‌రెడ్డి స్వతంత్ర అభ్యర్థిగానే విజయం సాధించారు. అంటే ఒక్క నియోజకవర్గం నుంచి ఇద్దరు స్వతంత్రులు ఎమ్మెల్యేలుగా ఎన్నిక కావడం, ఒక్కరే రెండుసార్లు విజయం సాధించడం విశేషంగా చెప్పవచ్చు.

జంగ్ తెలంగాణ

ఇంకా మరికొందరు..
కొల్లాపూర్ నియోజకవర్గం నుంచి 1967 ఎన్నికల్లో బి.నర్సింహారెడ్డి, 1972 ఎన్నికల్లో కె.రంగదాసు స్వతంత్ర అభ్యర్థులుగా బరిలోకి దిగి గెలిచారు. ఇదే నియోజకవర్గం నుంచి 1999లో కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించిన జూపల్లి కృష్ణారావు.. 2004 ఎన్నికల్లో పోటీకి సిద్ధమయ్యారు. ఇంతలోనే టీఆర్ఎస్, కాంగ్రెస్ పొత్తులో భాగంగా టీఆర్ఎస్‌కు చెందిన నిరంజన్‌రెడ్డికి టికెట్ దక్కింది. దీంతో జూపల్లి కృష్ణారావు స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచి విమానం గుర్తుపై విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో ఆయన ప్రత్యర్థి నిరంజన్‌రెడ్డికి డిపాజిట్ కూడా దక్కకపోవడం గమనార్హం. ఆ తర్వాత జూపల్లి 2009లో మళ్లీ కాంగ్రెస్ నుంచి, 2012, 2014 ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థిగా గెలిచారు. 2018లో ఓటమిపాలయ్యారు.

■ 1952లో నాగర్‌కర్నూల్ ద్విసభ్య నియోజకవర్గంగా ఉన్నప్పుడు బ్రహ్మారెడ్డి, రామస్వామి ఇద్దరూ ఇండిపెండెంట్లుగానే గెలుపొందారు. ఆ తర్వాత 1867 ఎన్నికల్లో వీఎన్ గౌడ్ ఇండిపెండెంట్‌గా బరిలో నిలిచి విజయం సాధించారు. అనంతరం ఆయన 1972, 1983 ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీచేసి గెలిచారు. కాగా.. నాగం జనార్దన్‌రెడ్డి 2009 ఎన్నికల్లో గెలిచాక తెలంగాణ ఉద్యమం నేపథ్యంలో రాజీనామా చేయడంతో 2012లో ఉప ఎన్నిక వచ్చింది. ఈ ఎన్నికల్లో నాగం స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. అప్పట్లో నాగం తరఫున ప్రచారానికి కేసీఆర్ రావడం విశేషం.

■ జడ్చర్ల నియోజకవర్గానికి 1962, 1967లో కొత్త కేశవులు, లక్ష్మీనర్సింహారెడ్డి స్వతంత్ర అభ్యర్థులుగా నిలబడి గెలిచారు. ఆ తరువాత మరెవరు స్వతంత్రులకు ఇక్కడ విజయం దక్కలేదు. 1957లో మక్తల్ నియోజకవర్గ ద్విసభ్య స్థానాలకు జరిగిన ఎన్నికల్లో ఒక రు కాంగ్రెస్ నుంచి గెలుపొందగా.. ఇండిపెండెంట్‌గా బన్నప్ప బరిలో నిలిచి విజయం సాధించారు.

■ మహబూబ్‌నగర్ స్థానానికి 1962లో జరిగిన ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థి ఎం.రాంరెడ్డి 3,634 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఇక 2004 ఎన్నికల్లో పులివీరన్న 19,282 ఓట్ల మెజార్టీతో, 2009లో రాజేశ్వర్‌రెడ్డి 5,275 ఓట్ల మెజార్టీతో స్వతంత్ర అభ్యర్థులుగానే గెలిచారు.

■ గద్వాల నియోజకవర్గానికి 1957లో జరిగిన ఎన్నికల్లో ఇండిపెండెంట్ డీకే సత్యారెడ్డి గెలుపొందారు. ఆ తర్వాత 1978 ఎన్నికల్లో ఆయన జనతాపార్టీ తరఫున విజయం సాధించారు. ఇక సత్యారెడ్డి కుమారుడు డీకే భరతసింహారెడ్డి 1994 ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా పోటీచేసి గెలిచారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన ఆయన ప్రత్యర్థి సమరసింహారెడ్డి సొంత సోదరుడే కావడం విశేషం. 1967లోనూ ఇక్కడి నుంచి ఉప్పల గోపాల్‌రెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందారు.

■ కల్వకుర్తి నియోజకవర్గం నుంచి 1962లో వెంకట్‌రెడ్డి, 1967లో ద్యాప గోపాల్‌రెడ్డి స్వతంత్ర అభ్యర్థులుగా గెలిచారు. ఆ తర్వాత 1994లో ఎడ్మ కిష్టారెడ్డి సైతం ఇండిపెండెంట్‌గా విజయం సాధించారు.


పులివీరన్న, మహబూబ్‌నగర్


డీకే సత్యారెడ్డి, గద్వాల


ఎడ్మ కిష్టారెడ్డి, కల్వకుర్తి


కె.రంగదాసు, కొల్లాపూర్


కొత్తకేశవులు, జడ్చర్ల


మురళీధర్‌రెడ్డి, అమరచింత


ఉప్పల గోపాల్‌రెడ్డి, గద్వాల


రాజా సోంభూపాల్‌రెడ్డి అమరచింత


చల్లావెంకట్రామిరెడ్డి, అలంపూర్

19న ప్రజా ఆశీర్వాద సభ

- సీఎం సభాస్థలిని పరిశీలించిన అధికారులు, నాయకులు


ప్రజా ఆశీర్వాద సభాస్థలిని పరిశీలిస్తున్న పోలీసులు, నాయకులు

శాంతినగర్: సీఎం కేసీఆర్ హాజరయ్యే భారీ బహిరంగ సభాస్థలాన్ని పోలీసు అధికారులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు మంగళవారం పరిశీలించారు. శాసనసభ ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఈ నెల 19న ఏర్పాటు చేసిన ప్రజాఆశీర్వాద సభకు హాజరుకానున్నారు. సమావేశానికి 50 వేల మందికి పైగా హాజరవుతారనే లక్ష్యంతో అందరూ కూర్చోడానికి అవసరమైన స్థలాన్ని బీఆర్ఎస్ నేతలు, పోలీసులు పరిశీలించారు. శాంతినగర్‌లోని వ్యవసాయ శాఖ కార్యాలయం వెనుక భాగంలోని పొలాల్లో 20 ఎకరాల స్థలాన్ని సభా నిర్వహణకు ఎంపిక చేశారు. అంతేగాక సభకు హాజరయ్యే వారికి అవసరమైన ఏర్పాట్ల గురించి స్థానిక నేతలు చర్చించుకున్నారు. కార్యక్రమంలో శాంతినగర్ సీఐ శివశంకర్‌గౌడ్, ఎస్ఐ నరేష్, వడ్డేపల్లి, రాజోళి మండలాల బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ పుల్లూరు నాగేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మహిపాల్‌రెడ్డి, మాణిక్యారెడ్డి, సూరి, భార్గవ్, మున్సిపల్ చైర్మన్ కరుణ, భాస్కర్‌రెడ్డి, నరేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా కళాఉత్సవ్ పోటీలు


విద్యాశాఖ అధికారులతో కళాఉత్సవ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

గద్వాల అర్బన్: విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని బాల భవన్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి కళా ఉత్సవ్ పోటీలు అట్టహాసంగా కొనసాగాయి. ఈ పోటీలకు డీఈఓ సిరాజుద్దీన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు వివిధ కళ రంగాల్లో రాణించాలని సూచించారు. త్వరలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జానపద, శాస్త్రీయ పాటలు, నృత్యాలు, త్రీడీ చిత్ర లేఖనం, వాయిద్య తదితర పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారులు ఏస్తేరురాణి, హంపయ్య, మాధవి, సుజాత, జయప్రకాష్, కృష్ణ, రామాంజనేయులు పాల్గొన్నారు.



మయూర వాహనంపై.. కురుమూర్తిరాయుడు
శ్రీదేవి, భూదేవి సమేతుడైన కురుమూర్తిస్వామి మయూర వాహనంపై ఊరేగారు. పల్లకీలో ఆశీనులైన స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి.. ప్రధాన ఆలయం నుంచి ఉద్దాల మండపం వరకు ఊరేగించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం మొదటిరోజు నిర్వహించిన కార్యక్రమానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ మదనేశ్వర్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, కమిటీ సభ్యులు నాగరాజు, వెంకటేశ్వర్‌రెడ్డి, సిబ్బంది శివానందచారి, శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

– చిన్నచింతకుంట

వైభవంగా రథోత్సవం


శ్రీపాగుంట శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి


హంస వాహనంపై స్వామివారిని ఊరేగించిన భక్తులు

- పాగుంట లక్ష్మీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న భక్తులు
- హంస వాహనంపై స్వామివారిని ఊరేగించిన భక్తులు

కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురం శివారులో వెలిసిన పాగుంట శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం వైభవంగా రథోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పెద్దలు భక్తులు పాల్గొని రథోత్సవానికి కొబ్బరికాయ కొట్టి ఉత్సవాన్ని ప్రారంభించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను హంస వాహనంపై ఉంచి ఆంజనేయస్వామి ఆలయం వరకు ఊరేగించారు. దీక్షవాహనం, లక్ష్మీగణపతి, హోమతర్పణాలు చేయగా.. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే నందిన్నెలోని కమ్మిడిస్వామి జాతర రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శేషిరెడ్డి, సర్పంచ్ ఆంజనేయులు, గోపి, తిమ్మారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


రథోత్సవాన్ని తిలకించడానికి వచ్చిన భక్తులు

జూరాలకు స్వల్ప ఇన్‌ఫ్లో
ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో స్వల్పంగా కొనసాగుతోంది. మంగళవారం రాత్రి 7 గంటల వరకు 4వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైనట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఆవిరి రూపంలో 89, భీమా లిఫ్ట్–1కు 650, ఎడమ కాల్వకు 920, కుడి కాల్వకు 731, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 300, సమాంతర కాల్వకు 550, భీమా లిఫ్ట్–2కు 750 క్యూసెక్కులతో కలిపి మొత్తం 2,940 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాల పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 7.953 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం పెంపు


గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

గద్వాల అర్బన్: విద్యార్థులు నిరంతరం గ్రంథాలయాన్ని సందర్శించడంతో విజ్ఞానం, సృజనాత్మకత, సామర్థ్యాలను పెంపొందించుకోవచ్చని ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ వైస్ ప్రిన్సిపాల్ శ్రీపతినాయుడు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రంథాలయాలు గొప్ప వ్యక్తిత్వవేత్తగా, రచయితగా, శాస్త్రవేత్తలుగా ఎదగానికి ఎంతో దోహదపడుతాయని చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు మంజులత, నాగేంద్రం, మనోజ్‌కుమార్, హరిభూషణం, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సజావుగా ఎన్నికలు నిర్వహించేలా చర్యలు

- ఎన్నికల పరిశీలకులు వసంత్‌కుమార్


కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకులు

గద్వాల క్రైం/ గద్వాల రూరల్: జిల్లాలో శాసనసభ ఎన్నికలు సజావుగా నిర్వహించేలా అధికారులందరూ అవసరమైన చర్యలు చేపట్టాలని ఎన్నికల పరిశీలకులు వసంత్‌కుమార్ అన్నారు. మంగళవారం ఐడీఓసీ కార్యాలయంలో పోలీసు విభాగ పరిశీలకులు అనుపమ్‌శర్మ, కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ రితిరాజ్‌లతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలోని అలంపూర్, గద్వాల నియోజకవర్గాల్లో ఎన్నికలు శాంతియుత, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేలా అధికారులు కృషి చేయాలన్నారు. ప్రధానంగా ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ, వీఎస్‌టీ, అకౌంటింగ్ టీమ్, ఎంసీఎంసీ, ఎక్సైజ్‌శాఖ అధికారులందరూ సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలన్నారు. జిల్లాలో మొత్తం 593 పోలింగ్ కేంద్రాలున్నాయని, మొత్తం 4,89,945 ఓటర్లున్నట్లు తెలిపారు. ప్రతిపోలింగ్ కేంద్రంలో ఓటర్లకు ఓటర్ స్లిప్పులను పంపిణీ చేసేలా చూడాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అవసరమైన కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ రితిరాజ్ తెలిపారు. సమావేశంలో ఆర్డీఓ చంద్రకళ, ఎన్నికల నోడల్ అధికారులు, పోలీసుశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కౌటింగ్ కేంద్రాల పరిశీలన..
పోలింగ్ ప్రక్రియ అనంతరం చేపట్టే కౌంటింగ్ ప్రక్రియకు అవసరమైన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని ఎన్నికల పరిశీలకులు వసంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన ఎన్నికల వ్యయ, పోలీస్ విభాగ పరిశీలకులతో కలిసి గద్వాల మండలం గోనుపాడు వద్దనున్న పాలిటెక్నిక్ కాలేజీలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రం, స్థానిక ప్రియదర్శిని మహిళా డిగ్రీ కాలేజీలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డిస్ట్రిబ్యూషన్, కౌంటింగ్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఇందుకు సంబంధించి సీసీ కెమెరాలు, లైటింగ్, పార్కింగ్, బారికేడ్లు వంటి సౌకర్యాలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ రితిరాజ్, అదనపు కలెక్టర్లు చీర్ల శ్రీనివాసులు, అపూర్వ్‌చౌహాన్, ఆర్డీఓ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

వివిధ పార్టీల ప్రతినిధులతో సమీక్ష..
జిల్లాలో ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా అధికారులందరూ కృషి చేయాలని ఎన్నికల పరిశీలకులు పి.వసంత్‌కుమార్ అన్నారు. వివిధ పార్టీలకు చెందిన ప్రతినిధులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాజకీయ పార్టీలన్నీ ఎన్నికల ప్రవర్తన నియమావళికి లోబడి పనిచేయాలని సూచించారు. ఏదేని కార్యక్రమాలకు సంబంధించి పార్టీలు తప్పకుండా సువిధ ద్వారా ముందస్తు అనుమతులు తీసుకోవాలన్నారు. ఓటర్లను ప్రలోభపెట్టేలా నగదు, ఇతర కానుకలు, లిక్కర్ వంటివి తరలిస్తే వెంటనే 6301754688 నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు రూ.40 లక్షలకు మించి ఖర్చు చేయరాదని సూచించారు.

సమస్యాత్మక అంశాలే లక్ష్యంగా విధులు..



అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల జనరల్ పరిశీలకులు మంగళవారం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ రితిరాజ్‌తో సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లా సరిహద్దుల వద్ద ఏర్పాటు చేసిన నిఘా, చెక్‌పోస్టులు, సిబ్బంది తదితర విషయాలపై తీసుకున్న చర్యలపై ఎస్పీని అడిగి తెలుసుకున్నారు. వివిధ కేసులో నమోదైన పాతనేరస్తుల కదలికలు, బైండోవర్, సమస్యాత్మక గ్రామాలు, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేందుకు మద్యం, నగదు, వస్తు సామగ్రి అంశాలపై అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల అనంతరం, లెక్కింపునకు అవసరమయ్యే సిబ్బంది వివరాలపై ప్రత్యేక వ్యూహంతో విధులు నిర్వహించాలన్నారు. జిల్లాలోని పలు విషయాలను ఎస్పీ వారికి వివరించారు.

ఎన్నికల సిత్రాలు..



బజ్జీ.. ఓటు

నారాయణపేట బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎస్.రాజేందర్‌రెడ్డి ధన్వాడలోని ఓ హోటల్‌లో బజ్జీలు వేసి అందరినీ ఆకట్టుకున్నారు. ఎన్నికల్లో ఓటువేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. - ధన్వాడ



చెప్పులు కుట్టి.. మద్దతు కూడగట్టి

కల్వకుర్తి అసెంబ్లీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచిన న్యాయవాది సుభాష్ వినూత్న ప్రచారానికి శ్రీకారం చుట్టారు. పట్టణంలోని శివాజీచౌక్ సమీపంలో చెప్పులు కుట్టి ఓట్లు అభ్యర్థించారు. - కల్వకుర్తిరూరల్



ఓట్లు.. పాట్లు

వనపర్తి జిల్లా రేవల్లి మండలం కొంకలపల్లి కొనుగోలు కేంద్రంలో జెడ్పీటీసీ భీమయ్య, రాష్ట్ర ఆర్గానిక్ సీడ్స్ డైరెక్టర్ సురేందర్‌రెడ్డి రైతుల ధాన్యాన్ని ఆరబోసి ఆకట్టుకున్నారు. ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఓటు వేయాలని కోరారు. - గోపాల్‌పేట



కుండ చేస్తా.. ఓట్లు పడతా..

కోస్గి పట్టణంలో జీహెచ్‌ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియొద్దీన్ కుండ తయారీ చేసి ఓటర్లను ఆకర్షించారు. ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు పట్టం కట్టాలని విజ్ఞప్తి చేశారు. - కోస్గి



మనిషి ఉన్నతుడా కాదా అన్నది అతడి విజయాన్ని బట్టి కాదు.. ప్రవర్తనను బట్టి అంచనా వేయాలి.
- స్వామి వివేకానంద

విసుగెత్తిస్తున్న టెలీకాలర్స్



ఎన్నికల వేళ టెలీకాలర్స్‌తో విసుగెత్తిపోతున్నామని ఓటర్లు వాపోతున్నారు. ఎన్నికల ప్రచారం మాటేమో కాని సమయం సందర్భం లేకుండా ఎప్పుడు పడితే అప్పుడు ఫోన్‌కాల్స్ వస్తుండటంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నామని అంటున్నారు. ఇదిలా ఉండగా.. కొన్ని సమయాల్లో ఎవరికి ఓటు వేస్తున్నారు? ఏ పార్టీకి మద్దతు ఇస్తున్నారని అడగడంతో పాటు ఈ వ్యక్తికి ఓటు వేయండని కూడా టెలీకాలర్స్ తెలియజేస్తున్నారు. సంబంధిత పార్టీ కాని వారికి మరొక పార్టీకి చెందిన ఫోన్‌కాల్స్ వస్తున్న క్రమంలో ఒక దశలో టెలీకాలర్స్‌పై ఓటర్లు చిర్రెత్తిపోతున్నారు. రాజ్యాంగ పద్ధతులను అనుసరిస్తూ రహస్యంగా వేయాల్సిన ఓటును రాజకీయ నాయకుల ప్రమేయంతో కొందరు వ్యక్తులు అపహాస్యం చేస్తున్నారని మండిపడుతున్నారు. - మన్ననూర్

పోలింగ్ ప్రక్రియలో మార్పులు

అచ్చంపేట: ఈసారి అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో స్వల్ప మార్పులు చేసింది ఈసీ. ఆ మార్పులను ఓటర్లు తప్పనిసరిగా తెలుసుకోవాల్సిన అవసరం ఉంది.

■ ఓటు వేయలేని పరిస్థితుల్లో ఉన్న వారికి సహాయకుడిగా గతంలో 18ఏళ్ల లోపు వారిని కూడా అనుమతించేవారు. కానీ వారికి సిరా చుక్క పెట్టేవారు కాదు. ఈసారి మాత్రం ఓటరు సహాయకుడు అదే పోలింగ్ కేంద్రం ఓటరై ఉండాలి. తను ఓటు వేసిన తర్వాతే మరొకరికి సహాయకుడిగా వెళ్లాలి. ఓటు వేసేటప్పుడు ఎడమ చేయి చూపుడు వేలుకు ఇంకు పెడతారు. ఓటరుకు సహాయకుడిగా వెళ్లినప్పుడు కుడి చేయి చూపుడు వేలుకు ఇంకు పెడుతారు. ఒక్కరికి మాత్రమే సహాయకుడిగా వెళ్లే అవకాశం ఉంటుంది.

■ గతంలో మాక్ పోలింగ్‌ను అరగంట ముందుగా ఏజెంట్ల సమక్షంలోనే నిర్వహించేవారు. ఈసారి దాన్ని 90 నిమిషాల ముందు నిర్వహించనున్నారు. అంటే ఉదయం 5:30గంటలకు మాక్ పోలింగ్ ప్రారంభిస్తారు. ఏజెంట్లు రాకపోతే 15 నిమిషాలు వేచి చూస్తారు. అప్పటికీ రాకుంటే పలింగ్ కేంద్రంలో అందుబాటులో ఉన్న అధికారులే మాక్ పోలింగ్ నిర్వహిస్తారు.

■ పోలింగ్ కేంద్రం పరిధిలోని ఓటరే అభ్యర్థి తరఫున ఏజెంటుగా ఉండాలన్న నిబంధన గతంలో ఉండేది. తాజా నిబంధన ప్రకారం ఆ నియోజకవర్గంలోని ఎక్కడి ఓటరైనా ఏజెంటుగా ఉండవచ్చు.



■ గతంలో పోలింగ్ ఏజెంట్లుగా ప్రజాప్రతినిధులను అనుమతించేవారు కాదు. ఈసారి సర్పంచ్, వార్డు సభ్యులు కూడా ఏజెంట్‌గా కూర్చునే అవకాశం ఉంది.

మార్మోగిన కురుమూర్తి గిరులు

- స్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- వైభవంగా కల్యాణం



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలు



కల్యాణ ఉత్సవంలో మంగళసూత్రాన్ని చూయిస్తున్న అర్చకులు

చిన్నచింతకుంట: తెలంగాణ ప్రజలు తమ ఇంటి ఇలవేల్పుగా కొలిచే శ్రీ అమ్మాపురం కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున ఆలయ సిబ్బంది స్వామివారి ప్రధాన ఆలయాన్ని శుద్ధిచేసి సుప్రభాత సేవ మొదలుకొని వేదపండితులు పూజలు ప్రారంభించారు. ఉదయం 8 గంటలకు ధ్వజారోహణ, బేరిపూజ, అష్టోత్తర కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛరణలతో కురుమూర్తి స్వామి, పద్మావతి, అలివేలు మంగమ్మ అమ్మవార్ల కల్యాణం కనులపండువగా కొనసాగింది. ఈ వేడుకను పురస్కరించుకొని శ్రీనివాసుడి దంపతులకు నూతన పట్టువస్త్రాలతో పాటు బంతిపూలు, మల్లెపూలు ధరింపజేశారు. కల్యాణాన్ని తిలకించేందుకు ఆయా గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో కురుమూర్తి కొండలు గోవింద నామస్మరణతో మారుమోగింది. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ మధనేశ్వర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, ప్రధాన అర్చకులు వెంకటేశ్వరచార్యులు, అర్చకులు వెంకటయ్య, నర్సింహులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూసంస్కరణలు చేపట్టి భూములు పంచాలి

- పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవచారి



మాట్లాడుతున్న జిల్లా కన్వీనర్ రాఘవచారి

మక్తల్: భూ సంస్కరణలు చేపట్టి పేదలకు భూములు పంచాలని పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవచారి అన్నారు. మంగళవారం మక్తల్‌లో విలేకరులతో మాట్లాడారు. కుల అణచివేత, మతవిద్వేషాలు, పితృస్వామిక హింస, దోపిడీ రాజ్యహింసలేని స్వేచ్ఛాయుత, మానవీయ ప్రజాస్వామిక విలువలు ఉన్న సమాజం నిర్మించుకోవాలని కోరారు. గ్రామాల్లో సంపూర్ణ మద్యనిషేధం విధించి కుటుంబాల జీవన ప్రమాణాలు కాపాడాలని అన్నారు. కృష్ణానది నీరు, రెండు తెలుగు రాష్ట్రాల మధ్య న్యాయంగా పంచాలని కోరారు. అప్పుడే ప్రజలకు న్యాయం జరుగుతుందని అన్నారు. మరికల్ మండలం చిత్తనూర్ వద్ద ఉన్న ఇథనల్ కంపెని ఎత్తివేయాలని కోరారు. రైతులు సాగు చేసిన పంటలు నష్టపోతున్నారని, వాతావరణ కాలుష్యంతో ఈ ప్రాంత ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. ప్రభుత్వ సంస్థలతో అందరికి ఒకే విధమైన విద్యా, వైద్యం ఉచితంగా అందించాలని అన్నారు. నిరుద్యోగతకు ప్రభుత్వం బాధ్యత వహిస్తూ.. నిరుద్యోగ వేతనం ప్రవేశపెట్టాలని అన్నారు. రోజుకు 4 షిఫ్టుల ఆరు గంటలు పని విధానం ప్రవేశపెట్టాలని అన్నారు. ఎన్నికల్లో ఓట్లు అడిగేందుకు వచ్చే వివిధ పార్టీ అభ్యర్థులను నిలదీయాలన్నారు. అక్టోబర్ 2, 3 తేదీల్లో మహబూబ్‌నగర్ కలెక్టరేట్ ఎదుట 30 గంటల సత్యాగ్రహ శిబిరం, ఆమోదించిన ప్రజా ఎజెండాను అమలు చేసేందుకు సత్యాగ్రహ శిబిరం నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లా కోకన్వీనర్ సుదర్శన్‌రెడ్డి, కేఎన్‌పీఎస్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ డి.చంద్రశేఖర్, విజయ్‌కుమార్, లింగన్న పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

బాలానగర్: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి (35) మృతిచెందిన ఘటన బాలానగర్ రైల్వేస్టేషన్‌లో మంగళవారం చోటుచేసుకుంది. మృతుడి కుడి చేయిపై హితేష్ అనే పచ్చబొట్టు ఉందని రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపారు. మృతదేహాన్ని షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించి, కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఘనంగా దుందువా వేడుకలు



గ్రామంలో దుందువా తయారు చేస్తున్న హరిజనులు

- 125 అడుగుల వావిలి, జీనుగ, గోగునార, కంది కట్టెలతో తయారీ
- రాష్ట్రంలోనే అతిపెద్ద దుందువా వేడుక

జడ్చర్ల టౌన్: అమాస మల్ల దుందువా అంటూ పాటలు పాడుతూ మండలంలోని గంగాపురంలో మంగళవారం రాత్రి దుందువా వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా లక్ష్మీచెన్నకేశవస్వామి కొలువైన గంగాపురంలో 125 అడుగుల దుందువాతో గ్రామంలో వేడుకలు అట్టహాసంగా, ఉల్లాసభరిత వాతావరణంలో కొనసాగించారు. దీపావళి అమావాస్య మరుసటి రోజున ఈ వేడుక నిర్వహించటం అనాదిగా వస్తుంది. ఇందుకోసం గ్రామ హరిజనులు తెల్లవారుజామున స్నానాదులు ఆచరించి పొలాల్లోంచి వావిలి, కంది, జీనుగ, గోగునార కట్టెలు తీసుకొచ్చి మూడు అడుగుల వెడల్పు, 125 అడుగుల పొడవుతో వరితాళ్లతో దుందువాను తయారు చేస్తారు. దాదాపు 50 మంది దుందువా తయారీ చేసేవారు పూర్తయ్యే వరకు నిష్టతో ఉండటం గమనార్హం. వరి తాళ్లను పేని వావిలి, గోగునార, జీనుగ కర్రలను పేర్చి పెద్ద దుందువాను తీర్చిదిద్దారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కేవలం పదిగంటల్లోనే దీన్ని తయారు చేయటం విశేషం. తయారైన దుందువా వద్ద హరిజనులు పూజలు చేసిన అనంతరం గ్రామస్తులు దాని చుట్టూ తిరుగుతూ మొక్కారు. అనంతరం రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో దుందువాను లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం ఎదురుగా తీసుకెళ్లి ఆలయ పూజారులు మేళతాళాలతో వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం జై చెన్నకేశవ నామస్మరణల మధ్య దుందువాకు ఒకవైపు నిప్పంటించారు. అనంతరం గ్రామస్తులు బారీ తాళ్లతో దానిని గ్రామ వీధుల్లోకి లాగుతూ దివ్వి దివ్వి దీపావళి అంటూ దాని వెంట పరుగులు తీశారు. పిల్లలు, యువకులు, మహిళలు ఉత్సాహంగా గోవిందనామస్మరణతో వేడుకల్లో పాల్గొన్నారు. గ్రామ వీధుల్లో దుందువా లాగుతుండగా.. దాని నుంచి విడిపోయే కర్రలు లాక్కునేందుకు పోటీ పడ్డారు. దుందువాలోని కర్రలను తీసుకెళ్లి ఇంట్లో ఉంచుకోవటంతో మంచి జరుగుతుందని గ్రామస్తుల విశ్వాసం. దుందువా వేడుకలతో గ్రామంలో శీతాకాలంతో వచ్చే వ్యాధులు ప్రబలకుండా ఉంటుందని గ్రామస్తుల నమ్మకం.

జోగుళాంబను దర్శించుకున్న ప్రముఖులు



చిరంజీవి సతీమణి సురేఖకు స్వాగతం పలుకుతున్న ఆలయ ఈఓ

జోగుళాంబ శక్తిపీఠం: అలంపురం జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాలను మంగళవారం మెగాస్టార్ చిరంజీవి సతీమణి సురేఖ, కుమార్తెలు సుష్మిత, శ్రీజ దర్శించుకున్నారు. వారికి ఆలయ ఈఓ పురేందర్‌కుమార్ ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు సంకల్పసిద్ధి గణపతికి ప్రత్యేక అభిషేకాలు, బాలబ్రహ్మేశ్వరుడికి ఏకవార రుద్రాభిషేకాలు చేశారు. కార్తీక మాసం కావడంతో వారు శైవ, శక్తి క్షేత్రాలను దర్శించుకున్న అనంతరం కార్తీక దీపాలను వెలిగించారు. అలాగే జోగుళాంబ ఆలయంలో త్రిశతి, ఖడ్గమాల అర్చనలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఆనంద్ శర్మ వారికి క్షేత్ర ప్రాశస్త్యం తెలియజేశారు. తీర్థప్రసాదాలను అందజేసి వేద ఆశీర్వచనం చేశారు. అదేవిధంగా అలంపురం బీఎస్పీ అభ్యర్థి ఆర్‌ఎస్.ప్రసన్నకుమార్ జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరుడి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆయనకు సాదర స్వాగతం పలికారు. ఆలయాల్లో పూజల అనంతరం తీర్థప్రసాదాలు అందజేసి శేషవస్త్రాలతో సత్కరించారు. అదేవిధంగా షాఅలీ పహిల్వాన్ దర్గాను దర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం తన గురువు ఆకుమళ్ల కృష్ణమూర్తి ఆశీస్సులు అందుకున్నారు.

నేడు బహిరంగ వేలం

అలంపురం జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో బుధవారం వివిధ రంగాలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ పురేందర్‌కుమార్ తెలిపారు. టెంకాయలు, పూజాసామగ్రి విక్రయించేందుకు రూ.10లక్షలు, వాహనాల పార్కింగ్ వసూలుకు రూ.10లక్షలు, ఫొటోలు, సీడీలు మొదలగునవి అమ్ముకునేందుకు రూ.3లక్షలు, కొబ్బరి చిప్పలు పోగు చేసుకునేందుకు రూ.3లక్షలు, మరుగుదొడ్ల నిర్వహణకు రూ.3లక్షల డీడీ చెల్లించి, వేలంలో పాల్గొనాలని కోరారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

చిన్నంబావి: అనుమానాస్పదంగా యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ ఓబుల్ రెడ్డి తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలో రత్నగిరి కాలనీలో నివాసం ఉంటున్న కాటం మల్లేష్(30) పెద్దదగడకి చెందిన మణెమ్మతో కలిసి ఇక్కడే నివాసం ఉంటున్నాడు. సోమవారం రాత్రి అతిగా మద్యం తాగి గుండెపోటుకు గురై మృతిచెంది ఉంటాడని, తమ ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. తండ్రి వెంకటస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, పూర్తిస్థాయిలో విచారణ చేపడుతున్నామన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో విజేతగా నిలవాలి

- తూప్రాన్‌కు తరలిన ఉమ్మడి జిల్లా జట్లు



ఉమ్మడి జిల్లా ఖోఖో జట్లతో హెచ్‌ఎం తదితరులు

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్లు విజేతలుగా నిలవాలని జిల్లా ఖోఖో సంఘం ప్రధాన కార్యదర్శి విలియం తెలిపారు. మెదక్ జిల్లా తూప్రాన్‌లో బుధవారం నుంచి ఈ నెల 17 వరకు నిర్వహించే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ ఖోఖో పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా బాల, బాలికల జట్లు మంగళవారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా స్థానిక మాడ్రన్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉమ్మడి జిల్లా జట్లను హెచ్‌ఎం దత్తు, విలియం అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా ఖోఖో సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి బాల్‌రాజు, వెంకటేశ్, మొగులాల్, రూప, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



కంచన్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలను వారిస్తున్న మహిళా కూలీ

మహిళా కూలీతో అంగన్‌వాడీ నిర్వహణ

మహమ్మదాబాద్ మండలంలోని కంచన్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ఓ మహిళా కూలీ టీచర్ అవతారమెత్తారు. కేంద్రంలో టీచర్, ఆయా లేకపోవడంతో ఓ కూలీని పెట్టి కేంద్రం నిర్వహణ కొనసాగించారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు అక్కడికి వెళ్లి చూడగా, మహిళా కూలీ బెత్తం చేతబట్టుకుని పిల్లలను వారించడాన్ని చూశారు. కూలీతో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహించడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వగా.. అంగన్‌వాడీ కేంద్రంలో కూలీని పెట్టలేదని, పక్క అంగన్‌వాడీ కేంద్రానికి ఇన్‌చార్జ్ ఇచ్చినట్లు సూపర్‌వైజర్ మల్లమ్మ తెలిపారు. - మహమ్మదాబాద్